క్లుప్తంగా

ఎర్రగట్టు జాతర ఆదాయం రూ.12,83,713



హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి జాతర ఆదాయం రూ.12,83,713 సమకూరింది. గతేడాది రూ.12,57,738 వచ్చినట్లు ఈఓ కిషన్‌రావు, ధర్మకర్తలు తెలిపారు. ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. హుండీ లెక్కింపు శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. హుండీ లెక్కింపులో ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, వింజమూరి రమణ, సదానందం, పెద్దమ్మ సురేష్, జన్ను శైలజ, అశోక్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, సుమంత్, అటికం శ్రీనాథ్, కనపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ : వరంగల్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో ఆపదమిత్ర స్కీం వలంటీర్ల (స్త్రీ, పురుషులు) శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి జిల్లా నివాసులై ఉండాలని పేర్కొన్నారు. 7 లేదా 10వ తరగతి మెమోతోపాటు మెడికల్ ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో ఏప్రిల్ 6వ తేదీలోగా మట్టెవాడలోని అగ్నిమాపక కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె అన్నారు. ఎక్స్ ఆర్మీ, రిటైర్డ్ మెడికల్, సివిల్ ఇంజనీర్ల వయస్సులో సడలింపు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు నోడల్ ఆఫీసర్ 8712699149 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కాజీపేట నుంచి కాశీకి ప్రత్యేక రైలు నడిపించాలి

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి కాశీ, అయోధ్య యాత్రకు ప్రత్యేక రైలు నడిపించాలని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన వోలు వెంకటేశ్వర్లు శర్మ సూచించారు. కాజీపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నిత్యం వందలాది మంది కాశీ యాత్రకు వెళ్లాలని అనుకున్నప్పటికీ సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో మిన్నకుండిపోతున్నారని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి ఒక రైలు ఉన్నప్పటికీ భక్తుల రద్దీ కారణంగా రిజర్వేషన్ దొరకడం లేదని వాపోయారు. కాశీతో పాటు అయోధ్య బాల రామాలయాన్ని చూడాలనే ఆతృత చాలామందిలో ఉందని అన్నారు. ప్రత్యేక రైలు విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తీసుకెళ్లాలని కోరారు.

వ్యవసాయాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలి

హన్మకొండ/విద్యారణ్యపురి: దేశంలో 70శాతానికి పైగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా మార్చి చట్టం చేయాలని తెలంగాణ మేధావుల ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎండీ.రియాజ్‌ను హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని నివాసంలో తెలంగాణ మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరస్వామి నాయకత్వంలో పలువురు శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ ఆల్ ఇండియా కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీకి వివరించి కాంగ్రెస్ తరఫున రైతులకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కోశాధికారి అక్కినపల్లి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు డాక్టర్ సంజీవ్, సాయిని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర సంఘటన్ ప్రధాన కార్యదర్శికి సన్మానం

హన్మకొండ: బీజేపీ రాష్ట్ర సంఘటన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌ను బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ సన్మానించారు. హనుమకొండలో శనివారం జరిగిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కోర్ కమిటీ, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రశేఖర్‌ను తన నివాసానికి రమేష్ ఆహ్వానించారు. ఇంటికి వచ్చిన ఆయనకు కుటుంబ సభ్యులతో కలిసి శాలువా కప్పి, భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని అందించి సన్మానించారు.

మాదిగలకే టికెట్ ఇవ్వాలి

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సీటును స్థానిక మాదిగలకే కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ మాదిగ డిమాండ్ చేశారు. హనుమకొండ వడ్డెపల్లిలో మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలకు అవకాశం ఇవ్వకుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బొచ్చు రాజ్‌కుమార్, ఇల్లందుల నరేష్, కస్నూరి సదయ్య, ఇమ్మడి హరీష్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే ఇంటి నిర్మాణం?

- కబ్జా చేసి కడుతున్నాడని మున్సిపల్ అధికారులకు స్థానికుల ఫిర్యాదు
- ఇంటి యజమానికి నోటీసులు జారీ
- పట్టించుకోని వైనం
- కొనసాగుతున్న నిర్మాణ పనులు



కాకతీయ కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న భవనం

హన్మకొండ చౌరస్తా : నగరంలో ఖాళీ స్థలం, కుంటను చదును చేసి కబ్జా చేయడం పరిపాటిగా మారింది. అందుకు భిన్నంగా ఓ వ్యక్తి రోడ్డును కబ్జా చేసి ఇంటిని నిర్మిస్తుండడం విశేషం. రోడ్డును కబ్జా చేయడంపై కాలనీవాసులు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ నిర్మాణ కొనసాగుతుండడంతో స్థానికులు పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఎవరైనా దౌర్జన్యం చేస్తే కేసులు నమోదు చేస్తామని కాలనీవాసులను హెచ్చరించినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు.. హనుమకొండలోని 9వ డివిజన్ పరిధిలోని అలంకార్ జంక్షన్ నుంచి కాకతీయ కాలనీకి వెళ్లే దారిలో ప్రధాన రోడ్డుపై ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. తనకున్న స్థలంతో పాటు పక్కనే ఉన్న 30 ఫీట్ల రోడ్డు స్థలాన్ని సైతం కలుపుకుని భవన నిర్మాణం చేస్తున్నారని స్థానికులు వాపోయారు. రోడ్డు కబ్జా చేస్తున్న విషయంపై మార్చి 14న అల్లం లక్ష్మణ్‌రావు అనే వ్యక్తి కాలనీవాసుల పక్షాన మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని సదరు యజమానికి నోటీసులు జారీ చేశారు. నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ భవన యజమాని సైతం నిర్మాణ పనుల్లో వేగం పెంచాడని స్థానికులు చెబుతున్నారు. వరుసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవులు రావడంతో నిర్మాణ పనుల కొనసాగిస్తుండడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో రంగంలోకి దిగిన హనుమకొండ పోలీసులు భవన నిర్మాణాన్ని అడ్డుకుంటే స్థానికులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు

వీధిలో ఎవరికైనా మెడికల్ ఎమర్జెన్సీ అయితే అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. మున్సిపల్ కార్పొరేషన్ కేటాయించిన 30 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి ఇంటిని నిర్మిస్తున్నారు. ఇదేంటని అడిగితే మాపై కేసులు పెడతామని పోలీసులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఇప్పటికైనా అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి ప్రజలకు ఉపయోగపడేలా 30 ఫీట్ల మేర సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మించాలి.

- జలీల్‌ఖాన్, కాకతీయ కాలనీ

అధికారులకు వివరణ ఇచ్చాం..

1974నుంచి ప్లాటుకు సంబంధించిన పత్రాలు మావద్ద ఉన్నాయి. వాటిని మున్సిపల్ కార్యాలయంలో అందజేసి నిబంధనల మేరకు ఇంటి నిర్మాణానికి అనుమతులు తెచ్చుకున్నాం. కొందరు డబ్బులు డిమాండ్ చేయగా, ఇవ్వకపోవడంతో తప్పుడు సమాచారంతో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై వచ్చిన నోటీసుకు వివరణ ఇచ్చాను. నిర్మాణాన్ని ఆపేయమని ఎవరు నాకు నోటీసులు ఇవ్వలేదు. ఈ విషయంపై కోర్టులో సైతం స్పష్టత తీసుకున్నాం. కావాలని పనులను అడ్డుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేశాం. మాకు రోడ్డును కబ్జా చేయాల్సిన అవసరం లేదు.

-డాక్టర్ జియాఉద్దీన్, ఇంటి యజమాని

పోలీస్ విధులు, రికార్డుల పరిశీలన



విధులు, పనితీరును వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్



మడికొండ: అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రతాప్

మామునూరు: ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో శిక్షణ పొందుతున్న 862 మంది సివిల్ మహిళా కానిస్టేబుళ్లు మామునూరు పోలీస్ స్టేషన్‌ను శనివారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ విధానం, కేసులపై వ్యవహరించాల్సిన తీరును శిక్షణార్థులకు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరించారు. అనంతరం పీటీసీలోని కాకతీయ హాల్‌లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాగ్యానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నైతికత అనే అంశంపై పీటీసీ గ్రంథాలయ ఇన్‌చార్జ్ రామాచారి వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు సతీష్, రవీందర్, వెంకటేశ్వర్ రావు, పాండునాయక్, భిక్షపతి, సీఎల్‌ఐలు వడ్డె నరేష్, అశోక్, రాజ్యలక్ష్మి, సీడీఐలు చంద్రశేఖర్, నవీన్, విజయ్, మహేష్, ఆర్ఎస్సైలు రాజేష్, సుధాకర్, దశరథం, ఏఎల్‌ఐలు సత్యనారాయణ, రాజన్‌బాబు, సుధాకర్, డాక్టర్ సుధీర్, ఫార్మసిస్టులు వెంకటేశ్వర్లు, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ: మడికొండ సిటీ పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లకు రికార్డుల నిర్వహణపై మడికొండ పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ శిక్షణ ఇచ్చారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ఉత్తర్వుల మేరకు మడికొండ పోలీసు స్టేషన్‌లోని రికార్డులు, పోలీసు స్టేషన్ పరిధిలోని నేర విచారణ ప్రక్రియ, కేసు ఫైల్ నమోదు వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని సూచించారు. ఎస్సై రాజబాబు, పోలీసు సిబ్బంది, శిక్షణ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షతో దానగుణం పెంపు



ఖిలా వరంగల్: ప్రార్థన చేస్తున్న ఉబేద్‌బాబా, జబ్బార్, తదితరులు



హనుమకొండలోని ప్రభుత్వ కళాశాలలో ఇఫ్తార్ విందులో అధ్యాపకులు

ఖిలా వరంగల్: అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ ఉపవాస దీక్షతో ముస్లింల్లో సేవా, దాన గుణం మరింతగా ఉద్భవిస్తుందని ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం శంభునిపేటలో జంక్షన్‌లో తవక్కల్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ ఎంఏ.మాషూక్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఉబేద్‌బాబా, జబ్బార్ హాజరై ఇఫ్తార్ విందును ప్రారంభించి మాట్లాడారు. మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోశాల పద్మ, సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్, పోశాల స్వామి, కేడల పద్మ, మంతిని సునీత, చాంద్‌పాషా, ఎండీ.హసన్ అలీ, మగ్దుమ్ హైమద్, ముత్యాజ్, సలాయొద్దీన్, అశ్రఫ్, జర్పొద్దీన్, రహీం, దస్తగిరి, మున్నాబాయ్, జుబేర్, సర్వర్ బేగ్, సలార్, ఎండీ.ఫసీ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్.. మత సామరస్యానికి ప్రతీక

విద్యారణ్యపురి: మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు శనివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీఐఈఓ గోపాల్, అధ్యాపకురాలు మాధవి, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ప్రజలే కాపాడుకుంటారు



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

కాజీపేట: కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా సబ్బండ జాతుల పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణతో పాటు బీఆర్ఎస్ పార్టీని ప్రజలే పదికాలాల పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాకముందు పార్టీ ఫిరాయింపులపై చేసిన వ్యాఖ్యాలకు సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉండాలని హితవు పలికారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకవిధంగా, అధికారంలోకి రాగానే మరోవిధంగా మాట్లాడడం రెండు నాలుకల ధోరణికి నిదర్శనం అని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుడు జోరిక రమేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరికి ఉన్నత స్థాయి పదవులను కేసీఆర్ కట్టబెట్టిన విషయాన్ని ప్రజలు గుర్తించాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కావ్యను ఓడించి గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేష్, సుంచు కృష్ణ, కాటపురం రాజు, పోలెపల్లి రాంమూర్తి, బైరి ప్రభాకర్, పి.శివకుమార్, సోని, మహమూద్ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ప్రతిష్ఠాపన పూజలు



ఖిలా వరంగల్: వరంగల్ గణేష్‌నగర్ కాలనీలో అభయంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ, వేద పండితుడు వేణునాథాచార్యుల ఆధ్వర్యంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠాపనకు దీక్ష కంకణం, అంకురార్పణ, పుణ్యాహవచనం, హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుణ్యాహ వచనంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నెల్లూరి శ్రీనివాస్‌రావు, సుతారి రాజు, రాధాకిషన్, విజయ్, సారంగం, రవీందర్, రవిబాబు, లక్ష్మీనారాయణ, అశోక్, రాకేష్, శ్రీనివాస్, సోమయ్య, శ్రీనివాస్, కిరణ్, సుమన్, రాకేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'రన్ ఫర్ జీసస్'



హసన్‌పర్తి: మాట్లాడుతున్న శ్రీధర్



లేబర్‌కాలనీ మీదుగా కొనసాగుతున్న రన్



హన్మకొండ చౌరస్తా: రన్ ఫర్ జీసస్‌లో క్రైస్తవులు

హసన్‌పర్తి: నగర వ్యాప్తంగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెంటనరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ప్రదర్శనను నిర్వహించారు. హసన్‌పర్తి నుంచి హనుమకొండలోని సీబీసీ చర్చి వరకు రన్ కొనసాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ యేసు మార్గం అనుసరణీయమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్ జాన్సన్, బీఆర్ఎస్ నాయకులు బోడ యుగందర్, వీసం సురేందర్‌రెడ్డి, భాస్కర్, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ: ట్రినిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నగరంలో శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. లేబర్‌కాలనీ మన్నా చర్చి నుంచి క్రిస్టియన్స్ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ, గీతాలు ఆలపిస్తూ హనుమకొండలోని సీబీసీ చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. రన్‌లో పలు చర్చీల పాస్టర్లు, సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా: కాజీపేట, హసన్‌పర్తి, వరంగల్ చౌరస్తాల్లో మూడు చోట్ల నుంచి వేర్వేరుగా బయలుదేరిన రన్ హనుమకొండలోని సెంటనరీ బాప్టిస్టు చర్చి వద్దకు చేరుకుంది. సెయింట్ పాల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బొడ్డు సునీతకు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరుతూ ట్రినిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రతినిధులు తెలిపారు. దళిత్ క్రిస్టియన్ అయిన సునీతకు టికెట్ కేటాయిస్తే గెలిపించుకునే బాధ్యత తమదని నినాదాలు చేశారు. అనంతరం చర్చిలో దేశ శాంతి, సునీతకు టికెట్ రావాలని ప్రార్థనలు చేశారు.

సైనికుల పిల్లలకు పూర్తి ఫీజు రాయితీ

హన్మకొండ: ఆకాష్‌లో సైనికుల పిల్లలకు వంద శాతం రాయితీ అందిస్తున్నట్లు ఆకాష్ రీజినల్ సేల్స్ అండ్ స్ట్రాటజిక్ హెడ్ భరత్ కుమార్ యాదవ్, డిప్యూటీ డైరెక్టర్ అమిత్ కుమార్ తెలిపారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని ఆకాష్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తమ విద్యాసంస్థలో మెడికల్, ఇంజనీరింగ్, ఫౌండేషన్ కోర్సుల్లో చేరే వారికి స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు వివరించారు. 2024వ సంవత్సరానికి ఇన్‌స్టంట్ అడ్మిషన్ కమ్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు భరత్ కుమార్, అమిత్ కుమార్ తెలిపారు.


సమాన అవకాశాలు కల్పించడమే ఆర్‌పీఐ లక్ష్యం



సమావేశంలో జన్ను సాంబయ్య, నాయకులు

హన్మకొండ: రాష్ట్రంలోని ప్రతీ పేదవాడికి సొంత భూమి, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడమే రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జ తారకం) ప్రథమ లక్ష్యమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య అన్నారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బహుజన రాజకీయ పార్టీల నాయకుల రాజకీయ వైఫల్యాలతో అంబేడ్కర్ కోరుకున్న బహుజన రాజ్యస్థాపనకు భగ్నం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 30ఏళ్లుగా ఉమ్మడి రాష్ట్రంలోనే జరిగిన కుల ఉద్యమాలు బూర్జువా పార్టీలకు ప్యాకేజీ సంఘాలుగా మారడం శోచనీయమని వాపోయారు. బీజేపీ విధానాలను ఎండగట్టాల్సిన దళిత బహుజన నాయకులు మనువాద ఎజెండాను ఎత్తుకోవడం, బహుజనుల ఐక్యతను దెబ్బతీయడం సమంజసం కాదని సూచించారు. గత బీఆర్ఎస్ గడీల పాలనకు, అణిచివేతకు వ్యతిరేకంగా ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్.. గడీల పాలనను బద్దలు కొట్టి బహుజన రాజ్యం ఏర్పాటు చేస్తారని ప్రజలు ఆశిస్తే చివరకు ఆ పార్టీలోనే చేరారని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఉయ్యాల శోభన్, జెమ్మల నాగరాజు, బొచ్చు సాంబయ్య, మ్యాకల రజనీ, పి.రజిత, కనుగుల శారద పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: బాలికలు, మహిళలను వేధించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని షీటీమ్ ఇన్‌స్పెక్టర్ సుజాత హెచ్చరించారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆకతాయిలు తిష్ట వేశారన్న పక్కా సమాచారం మేరకు శనివారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీసులు, షీటీమ్ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. పట్టుబడిన ఆకతాయిలకు షీటీమ్ అధికారులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం షీటీమ్ పనిచేస్తోందని వివరించారు. ఆపద ఎదురైనప్పుడు మహిళలు, బాలికలు 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లకు కాల్ సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు గోవర్ధన్, కుమారస్వామి, విద్యాసాగర్, హెడ్ కానిస్టేబుల్ బిచ్యా నాయక్, వీరేందర్, సూర్యనారాయణ, బండి భాస్కర్, రామ్‌రెడ్డి, పూర్ణ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వృత్తికే.. సేవకు కాదు



మహర్షిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



అనురాధను సన్మానిస్తున్న అడిషనల్ కమిషనర్, నాయకులు



దయాశీలను సన్మానిస్తున్న సిబ్బంది

విద్యారణ్యపురి: ఉద్యోగ విరమణ అనేది ఉపాధ్యాయ వృత్తికే కానీ సేవకు కాదని హనుమకొండలోని ప్రభుత్వ అభ్యాసన ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్వత్ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆముదాల దాత మహర్షి అన్నారు. ఆముదాల దాతమహర్షి ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ధర్మయ్య, ప్రాథమికోన్నత పాఠశాల స్టాఫ్ సెక్రటరీ సరళ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, సంతోష్‌రెడ్డి, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మణసుధాకర్, రమేష్, భాగ్యలక్ష్మి, రమాదేవి, సరస్వతి పాల్గొన్నారు.

బల్దియా ఉద్యోగి అనురాధ పదవీ విరమణ

వరంగల్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజం అని బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. బల్దియాలో దీర్ఘకాలం సేవలందించిన ఉద్యోగి పిండి అనురాధ పదవీ విరమణ బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమెకు అడిషనల్ కమిషనర్, ఉద్యోగులు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. అనంతరం అనిసుర్ రషీద్ మాట్లాడుతూ మున్సిపల్ విభాగంలో సేవలు అందించడాన్ని గొప్ప వరంగా భావించాలన్నారు. ప్రతి మనిషి పుట్టింది మొదలు మరణించే వరకు ప్రతీఅంశం మున్సిపాలిటీతో ముడిపడి ఉంటుందని, ఇలాంటి విభాగంలో పనిచేయడం, మానవ సేవగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి గోల్కొండ శ్రీను, సూపరింటెండెంట్ ఆనంద్, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య పాల్గొన్నారు.

ఆర్ఐ దయాశీల పదవీ విరమణ

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్న దయాశీల శనివారం పదవీ విరమణ పొందారు. బెటాలియన్‌లో శనివారం జరిగిన సమావేశంలో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి హాజరై దయాశీలను సన్మానించారు. దయాశీల విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఇండియన్ పోలీస్‌మెడల్ అందుకున్నారని శివప్రసాద్‌రెడ్డి కొనియాడారు. ఏసీలు కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్ఐలు శోభన్, రాజిరెడ్డి, రమేష్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రన్న, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న దేవేందర్ రెడ్డి

హన్మకొండ: విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ సీహెచ్.దేవేందర్ రెడ్డి సూచించారు. హనుమకొండ నయింనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో రాష్ట్రస్థాయి కామర్స్, మేనేజ్‌మెంట్ విద్యార్థుల సమ్మేళనం పినాకిల్ 2కె24 కార్యక్రమం శనివారం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన కామర్స్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బెస్ట్ మేనేజ్‌మెంట్ స్టూడెంట్, బెస్ట్ కామర్స్ స్టూడెంట్, బిజినెస్ క్విజ్, కామర్స్ క్విజ్, బిజినెస్ ప్లాన్, బాస్ ఆఫ్ బ్యాలెన్స్ షీట్, యాడ్ మానియా, బెస్ట్ డెసిషన్ మేకర్, ఐపీఎల్ బిడ్డింగ్, స్లో బైక్ రేస్, షార్ట్ ఫిలిం మేకింగ్, మీమ్ కాంటెస్ట్, ట్రెజర్ హంట్, ఫొటోగ్రఫీ, గ్రూప్ డాన్స్‌తో పాటు వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వాహినీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలం, ఎంబీఏ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజిరెడ్డి, కామర్స్ విభాగ అధిపతి దత్తాత్రేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు



ఖిలా వరంగల్: విద్యార్థులు ఏకాగ్రత, క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని వరంగల్ ఎంఈఓ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని న్యూకౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు కోడం సబిత ఆధ్వర్యంలో పాఠశాల కరస్పాండెంట్ కోడం శ్రీధర్ అధ్యక్షతన గిజాబాయి విద్యా భ్యాస వార్షికోత్సవం శనివారం జరిగింది. కరస్పాండెంట్ కోడం శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాల విద్యాభ్యాస విధానం, విద్యార్థుల విజయాలు, భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వడుప్సా మండల ప్రెసిడెంట్ ముక్కెర రవీందర్, సతీష్‌మూర్తి, క్రాంతికుమార్, శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.